

రుడా చైర్మన్‌గా రౌతు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం



రుడా చైర్మన్‌గా మాజీ ఎంఎల్‌ఎ రౌతు సూర్యప్రకాశరావు గురు వారం రాజమహేంద్రవరంలోని రుడా కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన రెండు సార్లు ఎంఎల్‌ఎగా, టిటిడి బోర్డు మెంబరుగా సేవలందించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి అనంతరం ఎట్టకేలకు ఆయనకు రుడా చైర్మన్‌గా అవకాశం లభించింది. ఈ పదవికి తొలుత మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలరెడ్డి ఖరారు చేస్తూ ప్రభుత్వం జిఒ విడుదల చేసింది. అనంతరం మరుసటి రోజే రౌతును నియమిస్తూ మరో జిఒను విడుదల చేయడం చర్చనీయాంశమైంది. దీని వెనుక ఎంపీ చక్రం తిప్పినట్టు వార్తలు వినిపిస్తున్నాయి.

అర్ధాకలితో మిడ్డేమీల్స్ కార్మికులు

- ధరలకనుగుణంగా పెరగని బడ్జెట్
- అమలుకు నోచుకోని కనీస వేతనం
- సమస్యల పరిష్కారం కోసం 5న 'చలో విజయవాడ'

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం ప్రతినిధి

విద్యార్థులకు అన్నంపెట్టి కడుపు నింపుతున్న మిడ్డేమీల్స్ కార్మికులు మాత్రం అర్ధాకలితో అలమటిస్తున్నారు. కనీస వేతనాలు లేక, బిల్లులు సకాలంలో విడుదల కాక నానా ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాలల సెలవులు మినహా నెలంతా వండి పెట్టినా వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి పట్టుమని రూ.3వేలు కూడా ఇవ్వడం లేదు. మధ్యాహ్న భోజన కార్మికులకు పనికి భద్రత కల్పించడంతోపాటు మెస్ బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లించాలని, కనీస వేతనం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నా పట్టించుకునే దాఖలాలే లేవు.

జిల్లాలో 980 స్కూళ్లలో మధ్యాహ్న భోజనాన్ని కార్మికులు వండి పెడుతున్నారు. వీటిలో 706 ప్రాథమిక, 85 ప్రాథమికోన్నత, 189 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఒక్కో విద్యార్థికి వండి పెట్టడానికి అవసరమైన నూనె, పోపు గింజలు, పప్పు, ఉప్పు, చింతపండు, కూరగాయలు, వంట చెరుకు తదితర సామగ్రి కోసం రూ.4.97 పైసలు, హైస్కూల్ విద్యార్థులకు రూ. 7.45 పైసలను మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తోంది. కనీసం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10, హై స్కూల్ విద్యార్థులకు రూ.20 చెల్లించాలని కార్మికులు కోరుతున్నారు. సోమ, బుధ, శుక్రవారాల్లో మూడు రోజులపాటు కోడిగుడ్డు కూడా మెనూలో భాగంగా ఉంది.అయితే మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగినా ఒక్కో విద్యార్థి కోసం ఇచ్చే నగదును మాత్రం ప్రభుత్వం పెంచడం లేదు. సబ్సిడీపై వంటగ్యాస్ అందించాలనే డిమాండ్‌ను ప్రభుత్వం పూర్తిగా పెడచెవిన పెట్టింది. రాగి జావ పంపిణీకి అదనపు అలవెన్సులు చెల్లించలేదు.



కట్టెలపొయ్యిపై వంట చేస్తున్న కార్మికులు

రాజకీయ జోక్యంతో ఇబ్బందులు

వైసిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగనన్న గోరుముద్ద పేరుతో మెనూలో మార్పులు చేసింది. ఆ మార్పులు తగినట్లుగా బిల్లులు మాత్రం పెంచలేదు. మరోవైపు పిఎంసి కమిటీలను నియమించింది. దీంతో రాజకీయ జోక్యం పెరిగింది. మధ్యాహ్న భోజన కార్మికుల అక్రమ తొలగింపులు, పని ప్రదేశాల్లో ఇబ్బందులకు గురి చేయడం సర్వసాధారణంగా మారాయి. నాణ్యత తగ్గినా, కూరలు, పప్పులు సరిపోనంత ఇవ్వకున్నా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రాథమిక స్థాయి పిల్లలకు ఒక్కొక్కరికి ప్రభుత్వం వంద గ్రాముల బియ్యం ఇస్తుంది. గ్రామీణ ప్రాంతాల పిల్లలు అల్పాహారం తీసుకునే అలవాటు లేకపోవడం అందుకు వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించకపోవడంతో మధ్యాహ్న భోజనంపైనే ఆధారపడుతున్నారు. అలాంటి విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న 100 గ్రాములు, 150 గ్రాముల బియ్యం సరిపోవట్లేదు. అదనంగా పిఎంసి కమిటీ సభ్యులూ అక్కడే భోజనం చేయడం ఫలితంగా కొన్నిచోట్ల భోజనం సరిపోవడం లేదు. దీనికి కార్మికులనే బాధ్యులను చేస్తున్నారు.

చాలా చోట్ల కట్టెల పొయ్యే దిక్కు

మధ్యాహ్న భోజనం వండేందుకు ప్రభుత్వం గ్యాస్ సరఫరా చేయాలని, మెస్ చార్జీలు కాకుండా వంట సరుకులు కూడా సరఫరా చేయాలని కొన్నేళ్లుగా కోరుతున్నా ప్రభుత్వం సానుకూలంగా స్పందించడం లేదు. గ్యాస్ భారం తట్టుకోలేక, అంత స్తోమత లేక ఇంటూ చాలా చోట్ల కట్టెల పొయ్యిపైనే వంట చేయాల్సి వస్తుంది. దీనికి వంట చెరకును వారే సమకూర్చుకోవాల్సిన పరిస్థితి. దీంతో పొయ్యి నుంచి వచ్చే పొగ వల్ల కార్మికులు ఆరోగ్యపరంగానూ సమస్యను ఎదుర్కొంటున్నారు. కార్మికుల్లో అత్యధిక మంది ఆస్తమా, ఎలర్జీలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గ్యాస్‌పై వంట చేస్తున్నా వీరికి భారం తప్పట్లేదు. మూడు, నాలుగు నెలలకు ఒకసారి గాని బిల్లులు రావట్లేదు. దీంతో కార్మికులే అప్పోసొప్పో చేసి గ్యాస్ బండలను వేయించుకుంటున్నారు. అలాగే సరుకులకు సంబంధించి కూడా బిల్లులు సకాలంలో చెల్లించట్లేదు.

జిల్లాలో నవంబరు నెల బకాయిలు రూ.57.75లక్షల వరకూ బకాయిలున్నాయి. ప్రతి నెలా మండల విద్యాధికారి జిల్లా అధికారులకు బిల్లును పంపగా అక్కడ నుంచి ప్రధాన ఫైనాన్స్ విభాగానికి వెళ్తాయి. నిధుల లభ్యతను బట్టి మూడు, నాలుగు నెలలకొకసారి ఫైనాన్స్ క్లియరెన్స్ అయ్యాక డబ్బు చెల్లిస్తున్నారు. అప్పటికే అప్పులకు వడ్డీలు కట్టలేక కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సమస్యలను పరిష్కరించాలి

మిడ్డే మీల్స్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి. 20 ఏళ్లుగా పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం చెల్లించే రేట్లకు మార్కెట్‌లో సరుకులు రావడం లేదు. నెల తరబడి బకాయిలు నిలిపివేయడంతో సొంత డబ్బులు పెట్టాల్సి వస్తుంది. మరికొందరు అప్పులు చేసి పథకాన్ని నడుపుతున్నారు.కట్టెల పొయ్యి వాడకం ఫలితంగా చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారు. నిత్యావసర సరుకులు, గ్యాసును ప్రభుత్వమే పంపిణీ చేయాలి. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రూ.10, హై స్కూల్ విద్యార్థులకు రూ.20 చొప్పున చెల్లించాలి. ఈ నెల 5న జరిగే చలో విజయవాడను విజయవంతం చేయాలి.

- ఎల్ఆర్.ఈశ్వరి, అధ్యక్షురాలు,
మిడ్డే మీల్స్ కార్మికు సంఘం, సీతానగరం



ట్యాబ్‌లు తీసుకున్న విద్యార్థులతో కలెక్టర్ మాధవీలత, డిఇఒ అబ్రహాం

ఇష్టంతో కష్టపడితే ఫలితాలు సాధ్యం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

ప్రస్తుత పోటీ ప్రపంచంలో చదువు పట్ల ఇష్టంతో కష్టపడితే మంచి ఫలితాలు సాధించవచ్చునని కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత అన్నారు. రూరల్ మండలం ధవళేశ్వరం జెడ్‌పి బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఉచిత ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం జగన్మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో కీలక మార్పులు తీసుకొచ్చి డిజిటల్ బోధనా విధానాన్ని అందించడం జరిగిందన్నారు. పాఠశాలల అభివృద్ధి అత్యంత ప్రాధాన్యతాంశంగా నాడు – నేడు పనులు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చారన్నారు. గోరుముద్ద పథకం ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తూ బాలబాలికలకు మధ్యాహ్న భోజన పథకంతోపాటు, రక్తహీనతకు గురికాకుండా చిక్కీలను అందిస్తూ వారిలో రోగనిరోధక శక్తిని పెంచుతున్నారన్నారు. అమ్మఒడి పథకం ద్వారా తల్లితండ్రులు పిల్లలను పాఠశాలలకు పంపేందుకు తల్లుల ఖాతాల్లో రూ.15 వేల జమ చేస్తున్నారని అన్నారు. ఉన్నత స్థాయిలోనికి ఎదగాలంటే కష్టపడే తత్వం పట్టుదల, లక్ష్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఏదీ కష్టపడకుండా సాధించలేమని, ఈ రోజు నేను కలెక్టరుగా ఉన్నానంటే నిరంతరం పట్టుదల కృషితో మాత్రమే అది సాధ్యపడిందన్నారు. జిల్లా పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా ప్రయోజనం కోసం ఈ ఏడాది రూ.48.67 కోట్లతో 15,210 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్నామన్నారు. గత ఏడాది రూ.56.80 కోట్లతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కలిపి 17,736 ట్యాబ్‌లను అందించామన్నారు. ట్యాబ్ యానిమేటెడ్ వీడియోలు, క్విజ్‌లు మరియు మరిన్నింటి ద్వారా అభ్యాసాన్ని ఇంటరాక్టివ్, విద్య పట్ల సమగ్ర దృక్పథంతో, రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేసిందన్నారు.

అలుపెరగని పోరాటాలు చేసిన సాబ్జి

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై ఎంఎల్‌సి షేక్ సాబ్జి అలుపెరగని పోరాటం చేశారని యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు ఐ.రాంబాబు అన్నారు. గురువారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ మండల శాఖ అధ్యక్షులు కె.వెంకటరత్నం అధ్యక్షతన సాబ్జి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా సాబ్జి చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో ఎంఎల్‌సి సాబ్జి మృతి ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర విస్మయానికి గురిచేసిందన్నారు. ఉపాధ్యాయ ఉద్యమంలో సాబ్జికి ప్రత్యేక పాత్ర ఉందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ, ఎస్.తాతా రెడ్డి, బి. రామారావు, కె.రామకృష్ణ, ఆర్ఎస్ఆర్.ఫణి, వి.విశ్వ ప్రసాద్, ఎంవివిఎస్ఆర్.రాజేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్‌సి సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



డిఇఒ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న విద్యార్థిని

రాష్ట్ర స్థాయికి గురుకులం విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి – గోపాలపురం

కౌశల్ పోస్టర్ ప్రజెంటేషన్‌లో అంబేద్కర్ గురుకుల పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థినీలు రాష్ట్ర స్థాయికి ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ టి.ఉమాదేవి తెలిపారు. పాఠశాలలో ఆమె గురువారం మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులు ఎం.సంజన(9వ తరగతి), డి. లిఖిత(8వ తరగతి) కౌశల్ పోస్టర్ ప్రజెంటేషన్లో జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. రాజమహేంద్రవరంలోని లాలాచెరువు హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో డిఇఒ అబ్రహం చేతుల మీదుగా నగదు బహుమతిని అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

ఓటింగ్‌పై అవగాహన

ప్రజాశక్తి – చాగల్లు

ప్రతి ఓటరు తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ఓటింగ్ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు ఓటు వేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిటి కె.నిరంజన్ కుమార్, ఎఎస్ఒ చిన్ని, ఆర్ఐ, విఆర్ఒలు, బిఎల్ఒలు పాల్గొన్నారు.

10వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

ప్రజాశక్తి – యంత్రాంగం

తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన అంగన్‌వాడీల సమ్మె గురువారానికి 10వ రోజుకు చేరింది. జిల్లాలోని డివిజన్, ఐసిడిఎస్ కార్యాలయాలు వద్ద, తహశీల్దార్, ఎంపిడిఒ కేంద్రాల వద్ద తమ నిరసనను వివిధ రూపాల్లో చేపట్టారు. కొన్ని ప్రాంతాల్లో వంటా వార్పు, మరికొన్ని ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ తమ సమస్యల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్యవైఖరిని ప్రజలకు వివరించారు. **రాజమహేంద్రవరం** తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా సబ్ కలెక్టరేట్ కార్యాలయం నుంచి గోకవరం బస్టాండు సెంటర్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. సుమారు 20 నిమిషాల పాటు మానవహారం నిర్వహించినా ప్రజలు స్వచ్ఛంధంగా సంఘీభావం తెలిపారు. మానవహారంలో జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, కనీస వేతనం, గ్రాడ్యూటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన సెలవులు, లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారం ఇవ్వాలని నినిదించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తూతూమంత్రంగా అంగన్‌వాడీ నాయకత్వంతో చర్చలు జరిపిందని, ప్రధానమైన డిమాండ్లు పక్కన పెట్టి డిమాండ్స్‌ను నెరవేర్చినట్లు ప్రకటించడం శోచనీయమని అన్నారు. ఇదే విధానంలో ప్రభుత్వం ముందుకు వెళ్లితే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ కార్మిక, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, లబ్ధిదారుల్ని కలుపుకుని ఉద్యమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జరీనా సరీఫ్, రాష్ట్ర నాయకులు టి.సావిత్రి, ఎపిటిఫ్ జిల్లా కార్యదర్శి కెవివి. సత్యనారాయణ మద్దతు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు సునీత, రామలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **చాగల్లు** స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలో చేపట్టిన నిరసన శిబిరం వద్ద మానవహారాన్ని నిర్వహించి ప్రభుత్వ వైఖరిని తూర్పార బట్టారు. తమ సమస్యలను పరిష్కరించేంత వరకూ తమ అందోళనను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి యూనియన్ నాయకులు పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, ఎస్.అరుణ కుమారి నాయకత్వం వహించారు. **గోకవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల ఆందోళనకు బిజెపి జిల్లా కార్యదర్శి మట్ట మంగరాజు, మండల బిజెపి అధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, నాయకలు ఇనకోటి దొర, బత్తుల వెంకటన్నబాబు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాల్సిన రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటర్ల తాళాలను పగుల కొట్టించి మరింతగా రెచ్చ గొట్టు తోందన్నారు. తక్షణమే అంగన్‌వాడీ యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. **ఉండ్రాజవరం** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల శిబిరాన్ని పెరవలి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ యూనియన్ గౌరవ అధ్యక్షులు జువ్వల రాంబాబు సందర్శించి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం ఆయన గ్రామంలో అంగన్‌వాడీలతో కలిసి భిక్షాటన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు ఎస్.రంగ నాయకమ్మ, కె.లక్ష్మి కుమారి, ఎం.జానకి, కెఎన్ ఎస్.ప్రసన్న కుమారి, సిహెచ్.జ్యోతి, ఎంవి.నరసమ్మ, జి.సువర్ణలత, పాల్గొన్నారు. **నల్లజర్ల** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసన శిబిరం వద్ద చిత్ర దర్శకుడు రాంగోపాల్ వర్మ దిష్టిబొమ్మను అంగన్‌వాడీలు దహనం చేశారు. అంగన్‌వాడీల సమ్మెపై రాంగోపాల్ వర్మ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. తక్షణమే అంగన్‌వాడీలకు రాంగోపాల్ వర్మ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని సిఐటియు జిల్లా నాయకుడు కొక్కిరి పాటి వెంకట్రావు డిమాండ్ చేశారు. అనంతరం భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.శివకుమారి, ఝాన్సీ, నాగమణి, క.విమల, కె.కనకదుర్గ, బేబీ, చంద్రకాంత, రాజేశ్వరి, టివిల్. విజయకుమారి తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జరుగుతున్న అంగన్‌వాడీల నిరసన శిబిరాన్ని సిఐటియు మండల అధ్యక్షురాలు రామలక్ష్మి పాల్గొని సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన మొండి వైఖరిని విడనాడి అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానికంగా అంగన్‌వాడీలు భిక్షాటన చేశారను. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి ఎస్.భగత్ పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మెపై నిర్లక్ష్యంగా వ్యవహర్తిందని, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. యూనియన్ నాయకులు టిపి.లక్ష్మి, టి.కుమారి, కె.గంగాభవాని, ఎ.పద్మకామేశ్వరి, కొమ్మిరెడ్డి బలుసుకుమారి, టి.దేవి, ఆర్.భవాని, సిఐటియు నాయకులు కె.రత్నాజీ పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** పట్టణంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా మాల మహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంత శ్యామ్‌రవిప్రకాష్ మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన అమలు చేయాలని కోరుతున్న అంగన్‌వాడీల పట్ల నిర్లక్ష్యంగా వ్యహరించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మాణిక్యాంబ, వివిధ యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **సీతానగరం** తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. కోరుకొండ సెక్టార్ సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షులు సిహెచ్.సువర్ణ, సెక్టార్ లీడర్లు సుభాషిణి, ఉమాదేవి, ప్రశాంతి, వెంకటలక్ష్మి, వెంకటేశ్వరి పాల్గొన్నారు. **పెరవలి** ఐసిడిసి కార్యాలయం వద్ద సమ్మెలో భాగంగా బిక్షాటన చేవారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు సుందర బాబు, పెరవలి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు జువ్వల రాంబాబు శిబిరాన్ని సందర్శించి మాట్లా డారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. సమస్యలను పరిష్కరించాలన్నారు. సిఐటియు సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గ, రామలక్ష్మి, శ్రీదుర్గ, కన్యాకుమారి, విజయ, పుణ్యవతి, జ్యోతి,నాగలక్ష్మి, రాణి, కష్ణవేణి, బి.సుజాత పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో పిల్లలతోనే పోరాటాన్ని సాగిస్తున్న అంగన్‌వాడీలు




రాజమహేంద్రవరంలో మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు



పెరవలిలో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



ప్రతిభను వెలికితీసేందుకే విజ్ఞాన ప్రదర్శనలు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం



లఘు నాటిక దర్శకురాలు శ్రీదేవిని ప్రశంసిస్తున్న డిఇఒ, ఇతరులు

విద్యార్థుల్లో తాగివున్న ప్రతిభను వెలికితీసేందుకే విజ్ఞన శాస్త్ర ప్రదర్శనలను నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎస్.అబ్రహం అన్నారు. శ్రీ సత్య సాయి గురుకులంలో జరుగుతున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు గురువారంతో ముగి శాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాస్త్ర విజ్ఞానం పట్ల ఆసక్తి పెంచేందుకు, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ప్రోత్సహించేందుకు ఈ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు మారుతున్న బోధనా పద్ధతులు, విధానాలకు అను గుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. విద్యా ర్థుల్లో ఉన్న ఆసక్తిని గమనించి వారిని ఆ దిశగా పోటీ లకు సిద్ధం చేయాలని సూచించారు. సత్య సాయి గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన 'అమ్మ' లఘు నాటిక ఆహూతులను అలరించింది. దర్శకురాలు శ్రీదేవిని డిఇఒ అభినందించారు. మొత్తం 57 ప్రాజెక్టుల నుంచి రాష్ట్ర స్థాయికి వ్యక్తిగతంలో ముగ్గురు, గ్రూపులో ముగ్గురు, ఉపాధ్యాయ ప్రాజెక్టులు మూడు మొత్తం 9 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని, ఈ నెల 28న కడపలో జరిగే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివైఇఒ ఇవిబిఎన్.నారాయణ, రూరల్ ఎంఇఒ ఎ.దుర్గా తులసీదాస్, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, శ్రీ సత్య సాయి గురుకులం కరెస్పాండెంట్ శ్యాం సుందర్, ప్రిన్సిపల్ గురయ్య, కోలా సత్యనారాయణ, రమణరావు, మంగిన రామారావు, రామానుజం, హరికృష్ణ, జాన్సన్, కె.రాజు, పిఇటిలు ప్రసాద్, దొర తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె



కోటగుమ్మం సెంటర్లో నిరసన దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని జెఎసి అధ్యక్షులు రఘు నాథ్ స్పష్టం చేశారు. ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం విజయవంతంగా రెండవ రోజుకు చేరుకుంది. ఈ కార్య క్రమంలో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన కార్యక్రమం చేపట్టారు. సమగ్ర శిక్ష జెఎసికి ఉద్యోగ సంఘాల నుంచి మద్దతు లభించింది. జిల్లా నలుమూళ్ళలా నుంచి ఉద్యోగులు అధిక సంఖ్యలు పాల్గొన్నారు. అలాగే జెఎసి నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. దీనికి గౌరవాధ్యక్షులుగా వంశీ, మిరప రాజు, అధ్య క్షులుగా రఘునాథ్, ఉపాధ్యక్షులుగా వెంకట్ , ఆర్.దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. ప్రభుత్వం తమ డిమాండ్‌లను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు.

ఉచిత వైద్య శిబిరాల ద్వారా పేదలకు సేవ



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది, పరిశీలన చేస్తున్న రవీంద్ర

ప్రజాశక్తి – కొవ్వూరు రూరల్

ఉచిత వైద్య శిబి రాల ద్వారా పేదలకు సేవలు అందించవచ్చని అక్షయపాత్ర ఫౌండేషన్ ఛైర్మన్, 15వ వార్డ్ కౌన్సిలర్, శ్రీ రామా సొసైటీ ఛైర్మన్ అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర అన్నారు. సిఎం జగన్ జన్మదినోత్సవ సందర్భంగా పట్టణంలోని యానాది కాలనీలో ఉన్న ఎంపిపి పాఠశాలలో ఉచిత దంత, కంటి వైద్య శిబిరాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస రవీంద్ర మాట్లాడుతూ ఇటువంటి వైద్య శిబిరాల నిర్వహణ ద్వారా పేదలకు సేవలు మరింత అందుబాటులోకి వస్తాయన్నారు. ఈ శిబిరంలో ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ అనుబంధ సంస్థ వైద్యులు, సిబ్బంది సేవలందించారు. అదేవిధంగా దంత వైద్యులు, సిబ్బంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కంటికి ఆపరేషన్ అవసరమైన వారికి వేమగిరి హాస్పిటల్‌లో నిర్వహిస్తామన్నారు. కళ్ళజోళ్ళు అవసరమైన వారికి ఉచితంగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

తరచూ అదనపు కట్నం తేవాలంటూ వేధిస్తున్న భర్త అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని అంకంపాలెం గ్రామానికి చెందిన వత్రపాటి కిరణ్ రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన శిరీష ప్రేమించుకున్నారు పెద్దల సమక్షంలో ఫిబ్రవరిలో వివాహం చేసుకున్నారు. వీరి కాపురం కొన్ని నెలలు సజావుగా సాగింది ఇటీవల కాలంలో పుట్టింటి నుంచి అదనపు కట్నం తేవాలంటూ భర్త, అత్త చిన్న అత్త, చిన్న మావయ్యలు వేధిస్తున్నారంటూ గురువారం పోలీసులు ఫిర్యాదు చేసింది ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బివి.కిరణ్ కుమార్ తెలిపారు

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి-గండేపల్లి

పామాయిల్ తోటలో గెలలు కోస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన గురుఆవరం గండేపల్లిలో చోటు చేసుకుంది. తూర్పు గోదావని జిల్లా కడియం మండలం జేగురు పాడుకు చెందిన పంజాపు తలుపులయ్య తన భార్య, కుమారుడు చక్రవర్తి (15)తో కలిసి కొప్పుల వీరన్న రెడ్డి పామాయిల్ తోటలో కూలి పని నిమిత్తం వచ్చారు. తోటలో పామాయిల్ గెలలు కోసే పొడవాటి ఇనుప కత్తి అక్కడే ఉన్న 11 కెవి విద్యుత్ వైరుకు తగలడంతో చక్రవర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన రిపోర్టుపై ఎస్ఐ వై.గణేష్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

13 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి- సామర్లకోట రూరల్

వేట్లపాలెం పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు పట్టుకున్నారు. కొమ్ము సత్యనారాయణ అతని బడ్డీ కొట్టులో అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు దాడి చేశారు. దుకాణం నుంచి 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ సురేష్ తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గండేపల్లి

కె.సూరంపాలెంకు చెందిన బొట్ల నాగేశ్వరరావు (41) అనారోగ్యంతో బాధ పడుతూ కుటుంబ పోషణ కష్టమై అప్పుల బాధలు తట్టుకోలేక గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కె.సూరంపాలెంలోని పామాయిల్ తోటలో పురుగు మందు తాగడంతో సమాచారం తెలుసుకున్న స్థానికులు కుటుంబ సభ్యులు కాకినాడ జిజిహెచ్‌లో జాయిన్ చేశారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు గండేపల్లి ఎఎస్ఐ పి.సీతారామరాజు తెలిపారు

చెరువులో మృతదేహం

ప్రజాశక్తి-గండేపల్లి

జెడ్.రాగంపేట బావి చిట్టి చెరువులో గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటన స్థలానికి వెళ్లి పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గణేష్ కుమార్ తెలిపారు.

అగ్నిప్రమాదంలో పది గుడిసెలు దగ్ధం

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల పోలీస్ స్టేషన్ వెనుక ఎస్ఆర్‌కె కళాశాల సమీపంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో పది గుడిసెలు దగ్ధమయ్యాయి. 15 కుటుంబాలు వీధినపడ్డాయి. స్థానిక తహశీల్దార్ వి.కిషోర్‌కుమార్ ఘటనా ప్రాంతానికి చేరుకుని స్థానికుల సాయంతో రక్షణ చర్యలు చేపట్టారు. నల్లజర్ల ఎస్ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. గుడిసెలకు సంబంధించి యజమానులంతా భవాని మాల ధరించడంతో తాడేపల్లిగూడెం రోడ్డులోని వీధిలమ్మ గుడి వద్ద కుటుంబ సభ్యులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఆ సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో ప్రాణ నష్టం తప్పింది. మంటలకు గ్యాస్ బండలు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగిందని స్థానికులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎంఎల్ఎ తలారి వెంకట్రావు, టిడిపి గోపాలపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి మద్దిపాటి వెంకట్రాజు, గ్రామ పెద్దలు పల్లి సుబ్బారావు, మాజీ సర్పంచ్ ఎలమాటి శ్రీనివాసరావు, టిడిపి గ్రామ అధ్యక్షులు నిమ్మలపూడి ప్రసాద్ ఘటనా స్థలాన్ని సందర్శించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

ప్రజాశక్తి - గోకవరం

బాలలు క్రీస్తు బోధనలను అనుసరించాలని ఇవాంజెలిస్ హెల్పింగ్ హ్యాండ్ పాస్టర్ రెమో జుహాని హాలోనెన్ అన్నారు. మండలంలోని కృష్ణునిపాలెం గ్రామంలో గురువారం రాత్రి ఇవాంజెలిస్ హెల్పింగ్ హ్యాండ్ చర్చిలో చిల్డ్రన్స్ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ చిల్డ్రన్స్ చర్చి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ఫెయిత్ ఇవాంజికల్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ రెవరెండ్ జోహాని హాలోనెన్ పాల్గొని మాట్లాడారు. బాల బాలికలు బాల్యం నుంచి ఏసుక్రీస్తు పట్ల నమ్మకంతో భక్తి శ్రద్ధలతో ఉండాలన్నారు. ఈ చిల్డ్రన్స్ చర్చి వేడుకల కార్యక్రమానికి హాజరైన బాల బాలికలకు విచిత్ర వేషధారణ, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అనంతరం బాల బాలికలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సుహాసిని హాలోనెన్, కన్నబాబు హాలోనెన్, కిషోర్ హాలోనెన్, పలువురు ఫస్టార్స్, మత పెద్దలు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - చాగల్లు

స్థానిక పిహెచ్‌సి వద్ద వైద్యాధికారి డాక్టర్ ఇ.తనూజ ఆధ్వర్యంలో జాతీయ కుష్టువ్యాధి నివారణ కార్యక్రమంపై అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ కారక్రమంలో జిల్లా క్షయ మరియు లెప్రసీ నియంత్రణ అధికారి డాక్టర్ వసుంధర, జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ డి.సంధ్య పాల్గొని కుష్టువ్యాధి లక్షణాలు, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వచ్చిన కుష్టు రోగులకు రొట్టెలు, పండ్లను జోన్నకూటి మహాలక్ష్మి అందచేశారు. స్థానిక పిహెచ్‌సి సిహెచ్‌ఒ జె.సుధీర్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపిఎంఎస్.మోషే, జె.వీర్రాజు, జమీల, ప్రభావతి, కె.నాగేశ్వరరావు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు పాల్గొన్నారు.

ఘనంగా సిఎం జగన్ పుట్టినరోజు



రాజమహేంద్రవరం రూరల్‌లో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న చందన నాగేశ్వర్

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను జిల్లాలోని పలు ప్రాంతాల్లో వైసిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. **రాజమహేంద్రవరం రూరల్** రూరల్ వైసిపి కార్యాలయంలో జరిగిన వేడుకల్లో రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ ఛైర్మన్, వైసిపి కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కేక్‌ను కట్ చేసి జగన్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ శ్రేణులు స్వీట్లు పంపిణీ చేశారు. **చాగల్లు** మండలంలోని పలు గ్రామాల్లో వైసిపి శ్రేణులు సిఎం జగన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల వైసిపి కార్యాలయంలో పార్టీ గౌరవ అధ్యక్షుడు జుట్ట ఏడుకొండలు, మండల అధ్యక్షుడు చేలంకుల దుర్గా మల్లేశ్వరరావు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జజ్జవర రామచంద్రరావు, గంద్రోత్ సురేంద్రకుమార్ పాల్గొన్నారు. **రాజమహేంద్రవరం** సిఎం జగన్ పుట్టిన రోజు వేడుకలను వైసిపి లీగల్ సెల్ అధ్యక్షులు డివివి త్రినాథ్, కార్యదర్శి పివివిఎన్‌బి.రాజు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ రీజనల్ కో-ఆర్డినేటర్ ఎస్ఎం సాధిక్ హుస్సేన్ పాల్గొని కేక్‌ను కట్ చేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ సెల్ సభ్యులు కె.గోపాలకృష్ణ, సిహెచ్.రామారావు చౌదరి, ప్రవీణ్ కుమార్, పిల్లి నాగిని రమ్య, కొయ్య కృష్ణమోహన్ పాల్గొన్నారు. **గోకవరం** స్థానిక ఎస్‌విఆర్ ఫంక్షన్ హాల్లో సిఎం జగన్ జన్మదిన వేడుకల్లో ఎంపిపి సుంకర శ్రీవల్లి పాల్గొని వికలాంగ విద్యార్థులకు హియరింగ్ మిషన్‌లు, ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ కారక్రమంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు, గుల్లా ఏడుకొండలు, పాటి రాంబాబు, సమ్మెట మోహన్, బుజ్జి, దాసరి చినబాబు, సుంకర రమణ పాల్గొన్నారు. **తాళ్లపూడి** ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు సిఎం జగన్ జన్మదిన వేడుకలను స్థానిక సచివాలయ-2 లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు జి.గణేష్, ఎస్.శ్రీను, తేజ పాల్గొన్నారు. అలాగే పెద్దేవం, రావూరుపాడు, గజ్జరం, ప్రక్కిలంక గ్రామాల్లో జరిగిన వేడుకల్లో కేక్‌లు కట్ చేసి విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్ టి వెంకట్రావు, ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ ఛైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, వైసిపి నాయకులు తోట రామకృష్ణ, యాళ్ళ బాబురావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **కడియం** కడియంలో గిరజాల వీర్రాజు (బాబు) ఆధ్వర్యంలో కడియం రైతులు వరి నాట్లుతో జగన్ చిత్రపటాన్ని రూపొందించి వినూత్నంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు స్టాలిన్, ఎంవిఎస్ఎం ఛైర్మన్ యాలి గోపాలం, సొసైటీ ఛైర్ పర్సన్‌లు టి.శ్రీను, వి. అచ్యుత్‌రామ్, మాజీ సర్పంచ్ డి.శేషగిరి, పార్టీ నాయకులు శాకా పట్టాభి, బట్టు చిన్ని పాల్గొన్నారు. **కొవ్వూరు రూరల్** మంత్రి డాక్టర్ తానేటి వనిత క్యాంపు కార్యాలయంలో జరిగిన వేడుకల్లో భారీ కేక్‌ను మంత్రి కట్ చేసి వైపిపి శ్రేణులకు మంత్రి తినిపించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరత్నాల సృష్టికర్త, సంక్షేమ సారథి జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం స్వర్ణ యుగంగా మారిందన్నారు. ఆయురారోగ్యాలతో చిరకాలం సిఎంగా ఉండాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు. **గోపాలపురం** చెక్‌పోస్టు సమీపంలో వైఎస్ఆర్ విగ్రహం వద్ద జగన్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించారు. ఎంఎల్ఎ తలారి వెంకట్రావు పాల్గొని కేక్ కట్ చేశారు. స్వీట్లు పంచారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంచిపెట్టారు.తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాలళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, జడ్‌పిటిసి సభ్యులు కె.లలిత, సొసైటీ అధ్యక్షులు కూసం రామ్మోహన్‌రెడ్డి, ఎంపిటిసి సభ్యులు జోగి కుమారి, కప్పల వరలక్ష్మి, వంగ మురళి పాల్గొన్నారు. **రాజానగరం** నన్నయ యూనివర్సిటీ ప్రాంగణంలో జగన్ పుట్టిన రోజును ఎంఎల్ఎ జక్కంపూడి రాజా, వైసిపి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల యువజన విభాగ రీజనల్ కో-ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మెగా జాబ్ మేళాను నిర్వహించారు. 40 కంపెనీల ప్రతినిధుల ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విసి పద్మరాజు, రిజిస్ట్రార్ జి.సుధాకర్, యూనివర్సిటీ ప్లేస్మెంట్ ఆఫీసర్ జగన్మోహన్ రెడ్డి పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** వేలివెన్నులో జడ్‌పిటిసి సభ్యులు నందిగం భాస్కర రామయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు బూరుగుపల్లి కృష్ణబ్రహ్మానందం, దమ్మెన్ను సర్పంచ్ గురజర్ల వీరవెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో సిఎం పుట్టినరోజును నిర్వహించారు. చివటంలో కె.సత్యనారాయణ, కె.వీరాస్వామి, వెలగదుర్రులో సర్పంచ్ ఎస్.పద్మావతి, ఎస్.రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో పుట్టినరోజు నిర్వహించారు. వెలగదుర్రు సర్పంచ్ సాగి పద్మావతి జన్మదినం పురస్కరించుకుని పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఆమెతో కేక్‌ను కట్ చేయించారు.



కడియంలో వరి నారుతో జగన్ చిత్రపటాన్ని వేసిన వైసిపి శ్రేణులు



గోకవరంలో కేక్ కటింగ్ చేస్తున్న ఎంపిపి శ్రీవల్లి

యానాం వార్తలు

ఘనంగా కనకాల తాతయ్య జయంతి



నివాళులర్పిస్తున్న పరిపాలనాధికారి మునిస్వామి, తదితరులు

ప్రజాశక్తి - యానాం

మాజీ ఎంఎల్ఎ కనకాల తాతయ్య జయంతిని స్థానిక సమాచార శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఫెర్రీ రోడ్డులోని ఆయన విగ్రహానికి యానాం పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ పూలమాలలు వేసి నివాళలర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో కలకాల రామదాసు, చింతా వెంకట్లు, కెఎల్‌వి ప్రసాద్, కనకాల తాతయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న గంగయ్య

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - యానాం

యానాం ఓల్డేజ్ హోమ్ ఆధ్వర్యంలో యానాం ప్రభుత్వ పాఠశాలలు, శారద విద్యానికేతన్ ఎయిడెడ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 310 మంది విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. స్థానిక సర్వ శిక్ష అభియాన్ కాన్ఫరెన్స్ హాల్లో రాజీవ్ గాంధీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులకు యానాం ఓల్డేజ్ హోమ్ కో ఆర్డినేటర్ పెసలు గంగయ్య గురువారం స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ఆకాంక్షించినట్టు తెలిపారు. 15 ఏళ్లుగా ఈ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దంగేటి త్రిమూర్తులు, కెఎన్.లక్ష్మి, నళిని, కె.రవిశంకర్, భవానీ ప్రసాద్, పి.రామ్ గోపాల్ పాల్గొన్నారు.

క్షయను సమిష్టిగా తరిమేద్దాం

ప్రజాశక్తి - నల్లజర్ల

అందరూ సమిష్టి కృషితో క్షయ వ్యాధిని తరిమికొడదామని నల్లజర్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు పిలుపునిచ్చారు. నల్లజర్ల పి.హెచ్.సి ఆవరణలో క్షయ వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ సక్రమరీతిన మందులు వాడితే క్షయ వ్యాధి ఖచ్చితంగా తగ్గి పోతుందన్నారు. క్షయ నివారణకు నాణ్యమైన మందులను అందజేస్తున్నామన్నారు. డాక్టర్ మహ్మద్ సిరాజ్ ఉద్దీన్ మాట్లాడుతూ క్షయ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుందని, దుమ్ము, ధూళి వల్ల కూడా సంక్రమిస్తుందన్నారు. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ సహకారంతో అందజేసిన పోషకాహార కిట్లు వైద్యాధికారి గంగాధరరావు క్షయ వ్యాధితో బాధపడుతున్న వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాదరావు, పబ్లిక్ హెల్త్ నర్స్ రాధాకుమారి, పర్యవేక్షకులు అన్నమ్మ, సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటికీ అందని నష్ట పరిహారం

ప్రజాశక్తి - సీతానగరం

తుపాన్ ప్రభావంతో పంట నష్టపోయిన రైతులకు నేటికీ ప్రభుత్వం నష్ట పరిహారాన్ని చెల్లించకపోవడం సిగ్గుచేటని టిడిపి బిసి నాయకుడు బర్ల బాబూరావు అన్నారు. తుపాన్ వల్ల నీట మునిగిన పంటపొలాలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ కోరుకొండ, సీతానగరం మండలాల్లో రైతులకు చెందిన పంట పొలాలను పరిశీలించానని, అయితే నేటికీ పలు ప్రాంతాల్లో నీటిలోనే పంటలు ఉన్నాయని అన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట నీటి పాలు కావడంతో రైతుల పరిస్థితి దారుణంగా మారిందన్నారు. వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి చేతికి అందివచ్చే సమయంలో వచ్చిన తుపాన్ రైతులను నిండా ముంచిందన్నారు. తుపాన్ ప్రభావం తగ్గి 15 రోజులు గడుస్తున్నా నేటికి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం చేసిన ప్రయత్నాలు ఏమీ లేవన్నారు. తక్షణమే ప్రభుత్వం రైతులకు ఇవ్వాల్సిన నష్ట పరిహారాన్ని ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

సాబ్జీ మరణం ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - కడియం

ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ అకాల మరణం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరనిలోటని యుటిఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి ఇవివిఎస్ఆర్ ప్రసాద్ అన్నారు. షేక్ సాబ్జి సంస్మరణ సభ గురువారం స్థానిక జడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల అధ్యక్షులు వివి.శాస్త్రి, ప్రధాన కార్యదర్శి బి.అబ్బాయి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాబ్జి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 ఏళ్లపాటు ఎన్నో ఉపాధ్యాయ, ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా ఉండి నడిపించిన నాయకుడు సాబ్జి అని కొనియాడారు. రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ అనిత, చిలుకూరి శ్రీనివాసరావు, డిటివిఎస్ నాగేంద్ర తదితరులు సాబ్జీ సేవలను గుర్తు చేశారు. అనంతరం మండలంలో సుదీర్ఘ కాలము ఉపాధ్యాయునిగా పనిచేసి ఇటీవల ఆకస్మికంగా మతి చెందిన అనిత టీచర్ మతికి సంతాపం వ్యక్తం చేశారు.

జెవివి ఆధ్వర్యంలో సైన్స్ పోటీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

రాజమహేంద్రవరం రాజమహేంద్రవరం రూరల్ చెకుముకి సంబరాలు మండల స్థాయి సైన్స్ పోటీలు సీతంపేట గ్రంథాలయంలో జెవివి జిల్లా కోశాధికారి ఎన్.రవిబాబు ఆధ్వర్యంలో గురువారం జరిగాయి. ప్రయివేటు పాఠశాలల విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు సద్గురు విద్యాలయయం, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి జడ్‌పి ఉన్నత పాఠశాల కాతేరు, ద్వితీయ బహుమతి ధవళేశ్వరం జడ్‌పి బాలికల ఉన్నత పాఠవాల గెలిపొందింది. జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షులు డాక్టర్ చైతన్య శేఖర్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడానికి కృషి చేస్తుందన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచనలు, సైన్స్ పట్ల సానుకూల దృక్పథాన్ని అలవర్చడానికి చెకుముకి పరీక్షలను ప్రతియేటా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం విజేతలకు చైతన్య శేఖర్ చేతుల మీదుగా బహుమతిలను అందచేశారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.రాజు, జనవిజ్ఞాన వేదిక యూత్ కమిటీ సభ్యులు సిహెచ్.నిశ్చల్, పేరిశెట్టి.శీదేవి పాల్గొన్నారు. అలాగే రాజమహేంద్రవరం అర్బన్ పోటీలు సీతంపేట గ్రంథాలయంలో జరిగాయి. ప్రయివేటు పాఠశాలల విభాగంలో ప్రథమ, ద్వితీయ బహుమతులు షిరిడి సాయి విద్యానికేతన్, తృతీయ బహుమతి భాష్యం ఇంగ్లీష్ మీడియం స్కూల్, ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి ఎస్‌కెవిటి ప్రభుత్వ పాఠశాల, ద్వితీయ బహుమతి ఎస్‌కెఆర్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల, తృతీయ బహుమతి ఆనంద నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలు గెలుపొందారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రాజు పాల్గొన్నారు. **కడియం**లో చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో విజేతలకు గురువారం బహుమతులను ఎంఇఒ లజపతిరాయ్, జెవివి కార్యదర్శి టివసంతరావు అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ బహుమతి కడియం, ద్వితీయ బహుమతి వీరవరం, తృతీయ బహుమతి దుల్ల జడ్‌పి ఉన్నత పాఠశాలలు కైవసం చేసుకున్నాయి. ప్రయివేట్ పాఠశాల విభాగంలో ప్రథమ ద్వితీయ బహుమతులను కడియం శ్రీ షిరిడి సాయి విద్యానికేతన్ విద్యార్థులు చేజిక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షులు వివి శాస్త్రి, ప్రధాన కార్యదర్శి బి.అబ్బాయి, కడియం హైస్కూల్ ఇన్‌ఛార్జ్ హెచ్ఎం రఫీ, యుటిఎఫ్ పూర్వపు ప్రధాన కార్యదర్శి బిఎవి.ఆనంద్ కుమార్, మహిళా అసోసియేట్ ఎం.వనజ, ఉపాధ్యక్షులు ఎ.దొరబాబు, కోశాధికారి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** స్థానిక జడ్‌పి హైస్కూల్లో మండల స్థాయిలో నిర్వహించిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. వీరు జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన ఎస్.దుర్గ మల్లేష్, జ్యోతి సాయి, రాంచరణ్‌లను భాష్యం స్కూల్ ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, ఉపాధ్యాయులు సిబ్బంది అభినందించారు.



రాజమహేంద్రవరంలో విజేతలకు షీల్డ్‌లు అందిస్తున్న జెవివి నాయకులు



విజేతలకు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న జెవివి నాయకులు

భూ హక్కుల చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా వ్యతిరేక ఎపి భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు డిమాండ్ చేశారు. జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు చేపట్టిన నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన గురువారం సందర్శించి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నష్టాన్ని చేకూర్చే ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలన్నారు. ఈ చట్టం వల్ల భూఆక్రమ ణలకు సౌలభ్యం ఉంటుందన్నారు. ఎలాంటి న్యాయ పరిజ్ఞానం లేని రెవెన్యూ అధికారులకు జ్యుడీషియల్ పవర్స్ ఇవ్వడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, రాజమండ్రి బార్ అసోసియేషన్ కార్యదర్శి కవి హనుమంతరావు, కోశాధికారి ఎంవి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులు గేదెల వెంకటేశ్వరరావు, రామారావు చౌదరి, కెవి.ప్రసాద్, సూరపురెడ్డి తాతారావు, జి.దేవిభవాని, దాసరి అమ్ములు, విక్టోరియా, వరలక్ష్మి, సీనియర్ న్యాయవాదులు తవ్వల వీరేంద్రనాథ్, కె.సునీల్ అంబటి మురళి, వి.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



న్యాయవ్యాదుల దీక్షలో మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి

ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం



ఎపిటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రజాశక్తి - తాళ్లపూడి

ఎపిటిఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక స్థానికమండల పరిషత్ స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగింది. సనపల రాజశేఖర్ ఎన్నికల అధికారిగా వ్యవహరించగా, ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దున్నా.దుర్గారావు పరిశీలకునిగా వ్యవహరించారు. ఈ ఎన్నికలో మండల శాఖ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది. నూతన పాలకవర్గానికి గౌరవాధ్యక్షునిగా జిబివిఎస్ఎన్.మూర్తి(నాని), అధ్యక్షునిగా పి.రఘువీర శాస్త్రి, ఉపాధ్యక్షులుగా జిజరాజారత్నం పి.కనకదుర్గ, పివి.కృష్ణమోహన్, ప్రధాన కార్యదర్శిగా వై.శంకరం, కార్యదర్శులుగా కె.ప్రసాద్‌రావు జివికె.రాజు, వి.శాంత కుమారి, జి. కృష్ణ, మరో ఏడుగురు జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గంతోపాటు పలువురు ఉపాధ్యాయుల అభినందించారు.

భారీ వృక్షం రీ ప్లాంటేషన్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ వినూత్నంగా రాజానగరం ఎడిబి రోడ్డులో రోడ్డు వైన్డింగ్‌లో తొలగించాల్సిన 60 సంవత్సరాల వయసుగల మర్రి చెట్టును క్రేన్ సాయంతో తెచ్చి కలెక్టర్ బంగ్లా పక్కన రీ ప్లాంటేషన్ చేశారు. కళాత్మకమైన రూపంలో ఉన్న మర్రి చెట్టును గత 60 రోజులుగా ట్రీట్మెంట్ చేస్తు నూతన ఏరులను వచ్చేదాకా ఉంచి గురువారం రీ ప్లాంటేషన్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.మాధవి లత పూజాది కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ మంచి కార్యక్రమం చేపట్టిందని అభినం దించారు. క్లబ్ అధ్యక్షులు తీగెల రాజా మాట్లాడుతూ జీవ ప్రాణికి ప్రాణవాయువును ఇచ్చే వృక్షాలను ఏ కారణం వల్ల కూడా తొలగించరా దన్నారు. ఈ కార్యక్రమంలో కమిష నర్ కె.దినేష్ కుమార్, రోటరీ క్లబ్ రోటీరియన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, సిహెచ్. సంపత్ కుమార్, రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ ఇమాని కిరణ్ పాల్గొన్నారు.



రీ ప్లాంటేషన్ చెట్టును పరిశీలిస్తున్న కలెక్టర్

కొనసాగిన జనసేన మహాపాదయాత్ర

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోనివంగలపూడి గ్రామంలో గురువారం రెండో రోజు జనసేన మహాపాదయాత్ర కార్యక్రమం జరిగింది. జనసేన యువజన నాయకులు తోట పవన్‌కుమార్ చేపట్టిన ఈ మహా పాదయాత్రకు ప్రజలు పూలవర్షం కురిపించారు. హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పవన్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జ్ బత్తుల బలరామకృష్ణ నాయకత్వంలో మూడు మండలాల్లో మహాపాదయాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. కోరుకొండ మండలంలో బలరామకృష్ణ, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, సీతానగరం మండలంలో తాను, రాజానగరం మండలంలో వారి కుమార్తెలు తోట ప్రత్యూష దేవి, వందనాంబిక ఆధ్వర్యంలో మహాపాదయాత్రలు జరుగుతున్నాయని అన్నారు. మహాపాదయాత్రలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేశారు. టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి గెలుపునకు కృచేయాలని కోరారు. స్థానిక ఎంఎల్ఎ తీరును దుయ్యబట్టారు. చినకొండేపూడిలో చిడిపి నగేష్, వరదా చిన్ని ఆధ్వర్యంలో 100 మంది జనసేన పార్టీలో చేరారు.



పాదయాత్ర చేస్తున్న తోట పవన్ కుమార్, జనసైనికులు